# నీళ్ళగోల

ఏడిద ప్రసన్నలక్ష్మి




'నీళ్ళు...నీళ్ళు...నీళ్ళు'!

ఊరంతా నీళ్ళయుద్ధమే.

రెండు రోజులుగా వాగాపెట్టిన నీళ్ళకారు వచ్చింది. దాని ముందు మైలున్నర దూరం క్యూ.

బిందెలను, బాల్చీలను పట్టుకుని తమ వంతు నీళ్ళ కోసం ఎదురుచూస్తున్నారు. కొందరైతే క్యూలో నుంచోకుండా అన్యాయంగా పక్కదోవనుంచి నీళ్ళు పట్టేసుకుంటున్నారు. ఓర్వలేని కొందరు వాళ్ళని ఎదిరిస్తున్నారు. దానితో — కుమ్ములాట, గుద్దులాట, తిట్ల వర్షం! మహాజోరుగా సాగుతోంది నీళ్ల పంపకం.

ఆ నీళ్ళ బందలో ఓ బామ్మ కాలుజారి పడబోయి — ఓపిక లేక నిస్సత్తువుగా కూలబడిపోయింది.

"ఇంకెంతమ్మా! ఇంకో పదిమంది దాటితే మీ వంతు వచ్చేస్తుంది. ఇంతసేపూ నుంచున్న దానికి ఫలితమేమిటి? ఎలాగో ఓపిక తెచ్చుకోండి" ధైర్యం చెప్పాడు — ఓ దయాశీలి.

"లేదు నాయనా! ఇక ఈ నీళ్ళ బాధ నేపడలేను. ఈ ప్రాణమేదో గుటుక్కున పోతేనే బావుండుననిపిస్తుంది." — ఆయాసంగా చెప్పారు బామ్మగారు.

"అయ్యో! అవేం మాటలండీ... మనమెన్ని బాధలుపడినా ఈ రోజు ఒక్కరోజే కదా! రేపటి నుంచి ఈ పడిగాపులు పడక్కర్లేదు. మున్సిపల్ చైర్మన్‌గారొచ్చి ఓవర్. హెడ్‌టాంక్‌ను ప్రారంభోత్సవం చేస్తారు, రేపే! ఎవరి వీధి కుళాయిల్లో వాళ్ళకే కావలసినన్ని నీళ్ళు"

ఆ మాటలతో ఊరట కల్గిన — బామ్మగారి కళ్ళల్లో తళుక్కున మెరుపు. ప్రాణంపోతే బావుండుననుకున్న ఆవిడకే, నిండు నూరేళ్ళు బ్రతకాలన్న ఆశ — క్షణంలో ఉవ్వెత్తున లేచింది.

ఆ దయాశీలి చేయి ఆసరాతో — మళ్లీ తన వంతుకోసం నిలబడ్డారు — బామ్మ. నీళ్లా దొరికేయి — బామ్మగారికి.

మర్నాడు ఉదయం...

అందరూ తమ వీధిలో కుళాయిలవద్ద బిందెలను పెట్టి అమృతం కోసం ఎదురుచూసే అమరవీరుల్లా ఆశగా ఎదురు చూస్తున్నారు. నీళ్ళు వస్తాయనుకున్న సమయందాటి గంటలు గంటలు దొర్లిపోతున్నాయి. ఒక చుక్క కూడా నీరుపడ్డంలేదు. అందరి ముఖాల్లోనూ ఆందోళన.

దారిన పోయే ఒకతను తీసుకొచ్చిన వార్తతో — ఉన్నట్టుండి వీధిలో కలకలంతో గుంపులు గుంపులుగా జనం పోగయ్యారు.

ఎవరి నోట విన్నా అదే చర్చ!

చైర్మన్‌గారు ఓవర్‌హెడ్ టాంక్ ప్రారంభోత్సవం చేసిన వెంటనే టాంక్ అడుగు భాగం కూలిపోయిందట.

ఆ వార్త విన్న అందరి ముఖాలు వెలవెలపోయాయి.

మళ్ళీ... నీళ్ళ టాంకర్!

దానిచుట్టూ — ఆ రభస మామూలే!









